# ఫారిన్ కొలాబొరేషన్

నిర్ఘాంతపోయాను. పాపారావు బంకు ఏమయింది? శ్రేష్ఠమైన పొగాకు చుట్టలిచ్చే పాపారావును ఏదో పెద్ద చేప మింగింది! పాపారావు బంకు ఉండవలసిన చోట అద్దాల షాపు వెలిసింది. నేను ప్రపంచాన్ని తిట్టుకొని పాపారావు కోసం జాలిపడుతుండగా ఒక ఫాషన్‌బుల్ మనిషి పెరిగిన జుట్టుతో బెల్‌బాటమ్ పాంట్‌తో బయటికి వచ్చి, నన్ను చూసి చిన్న కేక పెట్టాడు.

పాపారావే! హీ వండర్‌ఫుల్! చిన్న చేపను పెద్ద చేప మింగలేదు. చిన్న చేప పెరిగి పెద్దదయింది. కాని ఈ మార్పు ఎలా సాధ్యమయింది? పాపారావుకు పెట్టుబడిలేదు! పెద్ద ఆర్జనా లేదు – రోజుకు నాలుగు రూపాయలు అంతే!

పాపారావు నన్నులోపలికి తీసుకుపోయినాడు. కోకాకోలా తెచ్చి ముందుపెట్టాడు – షాపు నిండా కోక్‌లే!

"ఏమిటిది? ఏమయింది? జీతముమీద ఇక్కడ ఉంటున్నావా?" అన్నాను.

"అమెరికన్ కొలాబొరేషన్ గురూగారు! పీన్‌కోర్‌వాట్ట డాలర్లు పెట్టుబడి చేస్తాననీ, వ్యాపారం పెంచమనీ అన్నాడు. ఇదంతా ఆడి చలవ. అమ్మకాలు రోజుకు రెండింతలు దాటతాయి. అయితే అంత ఆడికే పోతుంది. పోదూమరీ? ఇదంతా నిజానికి ఆడిదేగా? నాకు రోజుకు అయిదారు రూపాయలు మిగులుతాయి చాలదా?" అన్నాడు.

పాపారావును అభినందించాను.

ఇది కిందటేడు. ఈ ఏడు అటుకేసి వెళితే "ఇండొ–అమెరికన్ కోకా కోలా సెంటర్" ఉన్నది గాని అందులో పాపారావు లేడు. ఇంకెవడో ఉన్నాడు. అమెరికా వాడు ఇండియా నుంచి ఉడాయిస్తూ షాపును మరెవడికో అమ్మాట్ట. పాపారావు ఏమయ్యాడో తెలీదు. మళ్లీ బంకు తెరుస్తాడా? తెరవడు. మళ్లీ లంక పొగాకు చుట్టలు అమ్ముతాడా? అమ్మడు.

ఇంక పాపారావు నాకు కనిపించే అవకాశం లేదు.

*ముద్రణ : యువ, జూన్ 1977*